ఆదర్శప్రాయురాలు

శ్రీమతి సి హెచ్. వు. రమణమ్మగారు

'కమలా! పేపర్లో విశేషాలేమిటే' అంది విమల.

'ఏముందే, పాపము, యమ్.బి.బి.యస్. చదివే విద్యార్థిఒకడు, జబ్బుతో బాధపడే ఒకపేదవానికోసం, తనశరీరంలోవుండే కొంత వేడిరక్తాన్ని యిచ్చివేస్తే, పేదవాడు బ్రతికి, ఆ త్యాగశీలుడు చనిపోయాడట. అంతా భగవల్లీల.'

'ఏమిటే, యెప్పుడూ పేదవాళ్లు పేదవాళ్లు అంటూ గోలపెడతావే. పేపర్లో విశేషాలేవీ లేవు? లేకపోతే నీకు కనబడవా? లైనడ్‌జార్జి అనే స్టీమరుఉందా, వెళ్లిపోయిందా? లూయిస్, వాళ్లస్టీమరు ఒకటి తప్పిపోయిందటగా?'

'ఏమోనే యివన్నీ నాకేం తెలుస్తాయ్. నీకంటు మీతండ్రిగారిచ్చిన ఓడలవ్యాపారం ఉంది కాబట్టి, యేఓడ యెప్పుడువచ్చిందో, యెంత వేరుసెనగ వేసుకొని వెళ్లిపోయిందో కావాలి. గాని నాకెందుకే యివన్నీ?

'మరేంకావాలి నీకు? ఏ యే దేశనాయకు లెప్పుడు జైలులో ఉంచబడింది, పేదవానిని ఎవ్వడు ఆదరిస్తున్నాడో, యివా నీకు కావలసినవి? ఎంతసేపూ పేదలు పేదలో అని ఏడుస్తారు. మీరు వాళ్ల మొఖం ఏలాచూడ బుద్ధవుతుందే? కావడిబద్దల్లాగు వంగిపోయిన నడుముల్లో, అరఅంగుళం లోపలకుపోయిన కళ్లు, సన్నగా వెదురువాసాల్లాగుండే అవయవాలతో చెమటకారుస్తు నల్లగా మాగిపోయిన దేహాల్తో, దేవుడా అంటూ ఏడుస్తుండేవాళ్ల విషయం ఆలోచించడమైనా ఎలాఆలోచిస్తారే మీరు?'

'పోనీగాని, పరీక్షలై పోగానే ఏంచేస్తావ్?' అంటూ మార్చేసింది సంభాషణ—కమల ఎంతసేపైనా ధోరణి యిలాగే పోతుందని.

'నీవేంచేస్తావ్?'

'చేసేదేముంది...బి.ఎ. పూర్తిచేసి ఎక్కడో ఉద్యోగంచేసి మాతలిదండ్రులను పోషించాలని దేశసేవచేస్తూ బీదలకోసం. పాటుబడాలని వున్నది. ఏమో మరి ఆపరమాత్ముని ఆదేశమెలావుందో! నీవేంచేస్తావ్?'

'నేను చేసేదేమిటి! ఏదో ఉన్న వ్యాపారాన్ని జాగ్రత్తగా నడుపుకోవడం, యింకో రెండువందల కూలీల్ని పెట్టించి 'లాండింగు' (Landing) కూడా మనమే చెయ్యడం అని వుంది'

'మరి పెళ్లి ఎప్పుడు చేసుకుంటావ్?'

'పెళ్లిమాట ఎత్తకు. ఒకరికి లొంగి వుండడం నాకిష్టములేదు. కాని నీమో స్తరుగా

సంసారంలోకి దిగటంతోడనే దేశసేవో, బీద సేవో, వెట్టిసేవో, నాశనంబౌతుంది అన్న ఆలోచనతో మటుక్కు-కాదు' అంది విమల.

విమల ఆలోచనలను చూచి ఒక చిరు నవ్వు నవ్వుకుంది కమల.

కమల విమలసహపాఠి; పేదరాలు. విమల ధనములో తులతూగుచూవుంది.

భాగ్యమునకు తగినట్లుగానే మనుజుల ఆలోచనలు నడుస్తూవుంటాయి. విమల యెప్పుడు తన చదువు పూర్తియగునా, యెప్పుడు మితిలేనిభాగ్యములో తులతూగుతూ, నిర్భాగ్యులగు పేదవారి మీద 'హుకుమ్' చలాయించడమూ అని ఆలోచిస్తూ వుంటుంది. ఆమె దృష్టికి ధనహీనులు యెందుకూ పనికిరారని దేశంలో భాగ్యభోగ్యములన్నీ అనుభవించటానికి తగరని అటువంటివారు చస్తేనే మేలనియు కనబడుచుంటుంది. కాని కమలమటుక్కు- అట్లుగాదు. పేదలను ఆదరించుట, విద్యరాని వాళ్లకు విద్యచెప్పించుట, దేశమునకు సేవ చేయుట మొదలుగాగల ఆలోచనలు ఆమె చిన్నమనస్సుకు తట్టుచూవుండేవి. స్థితిలో కమల చాలా పేదరాలయినప్పటికీని ఆమె మనస్సులోమట్టుక్కు- చాలా గొప్పఆలోచనలు పుట్టుచూవుండేవి.

౨

మనసులో వుద్దేశములకువనే వారి వారి భావిజీవితం ఆధారపడివుంటుంది. కమల బి.ఎ. పూర్తిఅగుటతోడనే చెన్నపట్నం వెళ్లి యెల్.టి. కూడా పూర్తిచేసి ఒక ఆడపిల్లల బడియందు ఏలూరులో హెడ్‌మిష్ట్రెస్‌గా వుండి నెలకు నూటయేబది రూపాయిలజీతం తెస్తూ తలితండ్రులను సోదరుని పోషింపుచున్నది. తలితండ్రులు మితిలేని ఆనందముకు పొందుచూవుండేవారు. ఈమాదిరిగా నాలుగేళ్లు గడిచినాయి.

కమల క్రమక్రమముగా తన జ్ఞానముకు అభివృద్ధి చేసుకొన్నది. పనిమానినది. దేశములోవున్న పెద్దలదయవలననూ, తను కష్టపడి సంపాదించుకున్న దానితోనూ, అనాథలకు శరణాలయం ఒకటి కట్టించవలయునని అనుకున్నది. గాని ఆమె మనస్సంతా తను పుట్టిపెరిగి చదువుకున్న పూర్వగు గుంటూరియందేయున్నది. వుండదా మరి! 'జననీజన్మభూమిశ్చ, స్వర్గాదపిగరీయసీ' అని పూర్వకే అన్నారా? అందుచేత గుంటూరులో 'శ్రీ భారతఅనాథశరణాలయం' అనే పేరుతో శరణాలయం కట్టించింది. కొద్దిరోజులలోనే ఆమె మొదలుపెట్టబోయేపని దేశాలకన్నిటికిని వ్రాకిపోయినది. చాలామంది తమతమ బిడ్డలను ఆశరణాలయమునకే పంపుటకు మొదలుపెట్టినారు. పై వూళ్లనుండి అనాథలు వితంతువులు నగు బాలికలు దాదాపు యేబది మందివచ్చి ఆమె శరణుచొచ్చినారు. వీరిలో వారంతా దాదాపు అరువదిలేక డెబ్బది మంది, భాగ్యవంతులయితేనేమి పేదవారయితేనేమి, వచ్చి ఆయూళ్లలో ప్రవేశించినారు. అద్బుత అన్నివిధములయిన విద్యలు నేర్పుతారు. హిందీ, సంగీతము, ఆంగ్లము, తెలుగు,

వ్యాయామము, నూలువడుకుట, దేశసేవ మరి యితర శాస్త్రములు మొదలగునవి అన్నిరకముల విద్యలను పిల్లలు నేర్పుతో నేర్చుకుంటూ వుండేవారు. కమలకు గాంధీ మతమన్న యిష్టము. అందుచేత ఖద్దరు కట్టుట వాలింటీరుపనులుచేయుట, తను కున్నవి సరికదా పిల్లలకుకూడా నేర్పించి ఆ పిల్లలను కన్నతల్లికంటె యెక్కువగా దయతో వారికి యేవిధమయిన లోపము లేకుండా పెంచుచున్నది. ఆబాలికలకుగూడా ఆ మాతృమూర్తి అంటె అటువంటి భయ భక్తులే వుండేవి. ఉండక యేమవుతాయి. చెట్టొకటి ఐతే విత్తువేరొకటిఅవుతుందా? అందుచేత కమల తను స్థాపించిన వృద్యమాన్ని తన అన్నగారి సహాయముచే ఒక విధముగా బాగానే నేర్పుతో గడుపుకొని వస్తున్నది.

ఇక ఆమె ఆశ్రమములో కార్యక్రమము చాలా పొగడతగినదిగావున్నది. విద్యార్థినులు ఉదయం నాలుగుగంటలకే లేవడం కాలకృత్యములు స్నానములు మొదలగునవి పూర్తిచేసుకొని అయిదు గంటలకల్లా, ప్రార్థనామందిరములోనికి వెళ్ళవలయును. కమల కూడా అప్పటికప్పుడే స్నానము మొదలగునవి పూర్తిచేసుకొని ఖద్దరువస్త్రములు ధరించి మూర్తీభవించిన భారతమాతా యున్నట్లు వచ్చి తన నియమిత స్థానమునందు చేతులు జోడించుకొని నిలుచుని వుంటుంది. పిల్లలంతా ప్రార్థనకు తయారుగానున్న పుడామె నిశ్చలమైన మనస్సుతో కళ్ళుమూసుకొని 'వందేమాతరం'అనే కీర్తన భక్తిభావముతో పాడుతుంది. ఆమెప్రార్థన ముగించుటతోడనే పిల్లలందరూ మహాత్మునికి ప్రియమైన 'వైష్ణవ జనతో' అనే కీర్తన పాడతారు. తరువాత కమల దాదాపు ఒక అరగంటసేపు భగవత్ గీతచదివి పిల్లలకు చెప్పుతుంది. అటుతరు వాత క్రమముల ప్రకారం కొంతమంది పిల్లలు వీణెయు మొదలగు వాటితో చక్కని సంగీతమును పాడి ఆశ్రమములోవుండే పశుపక్ష్యాదులను, మనుజులను, చివరకు భవనమును కూడా మేలుకొలుపుకొనుచున్నారా యనునట్లు మధురమగు కంఠముతో గలిపి సంగీతమును పాడి ఆరుగంటలకల్లా వారివారి గదుల లోనికి వెళ్ళిపోవుదురు. తరువాత యేడు గంటలకల్లా చల్ది అన్నముభుజించి స్కూలికి వెళ్ళి తమతమ పాఠములను గురువులయొద్ద భక్తి శ్రద్ధలతో నేర్చుకొని తిరిగి పదిగంట లకు తమ నియమిత గదుల లోనికి వెళ్ళిపోయెడివారు. తిరిగి రెండుగంటలకల్లా వ్రాలుకట్లు చదువు దుస్తులు మార్చుకొనుట మొదలగునవి పూర్తిచేసుకొని నాలుగు గంటలవరకూ స్కూలులోపాఠములను నేర్చుకొందురు. నాలుగుమొదలు అయిదుగంటల వరకూ కమలే స్వయముగా పిల్లలందరికీని వ్యాయామపద్ధతులను నేర్పుతుంది. అటు తరువాత సాయంత్రము యేడుగంటలవరకూ ఆటలు, భోజనములు, ముగించుకొని పది గంటలవరకూ తమ పాఠములను నేర్చుకొనవలయును. పదిగంటలు దాటినతరువాత యెవ్వరునూ మేలుకొనియుండకూడదు.

ఇక విమలో — చిన్ననాడు చెప్పినట్లు వ్యాపారాన్ని వృద్ధిచేసింది. ఆమె క్రింద యిప్పుడు వెయ్యిమంది కూలీలువున్నారు. భాగ్యవంతురాలననే గర్వముచే కళ్లు నెత్తి మీదకు వచ్చినవి. రెండుచేతులా డబ్బు గణించుచున్నది. ఆమె అంటే కూలీలందరికినీ అపరిమితమయిన భయము. యేంచేస్తారు. జీవనోపాధికి వేరుమార్గంలేదు. రోజురోజుకూ భారతదేశమందు దరిద్రులు, కూడూగుడ్డలు లేక 'అన్నమో రామచంద్రా' అని మలమలా మాడి చావవలసి వస్తున్నది. కష్టపడి రాత్రింబగళ్లూ ఓడమీద సముద్రములో పని చేయుట సరికదా యజమానుల చీవాట్లు చెప్పుదెబ్బలు వారు పడలేకుండానున్నారు. యెవరికయినా యెంతకష్టపడి పనిచేసినా సంతోషించి ఆదరించే యజమానులుంటే వారి కష్టములు పటావంచలగును. గాని విమల సంగతి అట్లు కాదాయెను. కూలీలు మటుక్కు యేమిచేస్తారు. డబ్బు మదము చేత విమలకు కళ్లు కనుపించుటలేదు. కమల సంగతియే మరచిపోయినది. తను ఆడునది ఆట పాడునదిపాట.

3

తనపాఠశాల చందాలనిమిత్తమై కమల విమలఉన్న ఊరువెళ్లినది. అచ్చటికి వెళ్లిన తోడనే విమల సంగతంతా తెలిసినది. కూలీలు పనిచేసే గంటలుతగ్గించమని, కూలిడబ్బు ఎక్కువచేయమని ప్రార్థిస్తూన్నాగాని ఆమె వినడంలేదు. అందుచే కూలీలంతా సమ్మె కట్టా లనుకుంటున్నారని వింది. అనాడు సాయంత్రం సభలో కూలీలంతా ఏకమవవలెనని, తమకష్టాన్ని బాపేవరకూ పనిలోనికి వెళ్లకూడదని చెప్పింది. కూలీలులేని యజమానుడుగాని, యజమానురాలుగాని, ప్రాణాలులేని దేహాలని, పేదకూలీల క్షేమమే యజమానురాలి బలమని ఉపన్యసించిన తరువాత కూలీలకందరికీ పట్టుదల ధైర్యం పెంపొందినాయి. పట్టినపట్టు వదలకూడదని నిశ్చయించుకున్నారు.

నాలుగురోజులు గడచిపోయినవి. కూలీలు పనిలోకి వెళ్లడంలేదు. విమలకు ఆశ్చర్యం వేస్తోంది. ఉపన్యాసలిచ్చేవ్యక్తి యెవరో, తనవద్దకువస్తే కాల్చివేస్తామన్నంత ఆవేశంతో వుంది. గవర్నమెంటుసహాయంవల్ల కూలీలనందరినీ, నాశనంచేయాలనేటటువంటు ఆలోచనకూడాపుట్టింది. కాని ఏమిచేయుటకును పాలుపోకుండా వున్నదామెకు. అప్పుడు వాళ్లతో రాజీపడితే బాగుంటుందనుకొంది. అందుచేత మధ్యవర్తుల్ని కూలీలవద్దకు పంపినది. కూలీలంతా వాళ్ళవైపు మధ్యవర్తిగా మాట్లాడడానికి కమలను ప్రార్థించినారు. కమల సరేనన్నది.

అదిఒకరోజు సాయంత్రం. ఇంకాకొంచెముసేపటికే సూర్యుడు ఆకాశమంతా నెత్తురు పూసేస్తాడు, అటువంటి సమయమందు కమలను చూడ్డానికని ఆమెబంగాళాకు బయలుదేరింది. మొదట గర్వముతో మిడిసిపడుచున్న విమలకు, కమల జ్ఞాపకానికేరాలేదు. అందుచేత ఆమె తన్నుపుకుచూచుటకు వీలులేదని కబురుపంపినది. గాని చివరకు ఆమెరాకకు

అంగీకరించినది. పేదరాలగు కమలతో మాట్లాడడానికి ఆమెపరువుకు భంగమనుకొంది. కమలవెళ్లి వారి చిన్నప్పటిసంగతంతా జ్ఞాపకంచేసింది. గాని ధనమదాంధురాలగు విమలకు అవియేమియును చెవికి సోకడములేదు. ఎల్లాగయితేనేమి, దయార్ద్రహృదయయగు కమల, విమలతో, తన ఓడలలో పనిచేసెడి కూలీలవిషయమై యెత్తినది. వారిని దయతోచూడమని ప్రతిమలాడింది. అంతకంతకు కమలమీద కోపము యెక్కువఅయినది. రోగికి పథ్యపుమెతుకులు రుచిస్తాయా? చివరకు విమలకు యేమీదారితోచక నౌకర్లను పిలిపించి కమలను యింటినుండి తరిమివేయునట్లు ఆజ్ఞాపించినది. కమల తన్ను కూలీలుపంపేరని వాళ్ళకుకావలసినపని గంటలు తగ్గించమనియు, జీతము యెక్కువచేయమనియు అని అడిగింది. అహంకారమదముచేత విమల తనవల్లే యిదిఅంతా వచ్చిందని, తన్ను నాశనంచేయాలంటే కొన్నినిముషాలుపట్టదని కమలపై కోప్పడసాగింది. కాని కమల కరుణారసపూరిత. కోపమేమిటో యెరుగదు. విమలయును కూలీలు తిండిలేక మాడుచున్నారు. వారిమీద కొంచెం జాలిచూపించుఅని ప్రార్థించుచున్నారు. గర్భదరిద్రులగు కూలీలు తమకమలాదేవి యేమివార్తతెస్తుందో యని బయట విమల గుమ్మముముందు బారులుదీర్చి కూర్చున్నారు. కమలను నౌకరు చెయ్యిపట్టుకొని బయటకు గెంటడం చూచేటప్పటికీ అందరికీ ఒకమ్మడి విమలమీద తిరుగబడుదామాఅని అనిపించినది. కాని కమలచెప్పే శాంతవచనాలవల్ల వారిఅగ్ని చల్లారిపోయింది. ద్రౌపదీ వస్త్రాపహరణమే కౌరవనాశనానికి ఆదిమెట్టు అన్నాడు. ఇదికూడా......

కమల కూలీలందరికీ నీతినిబోధించినది. ఓర్పుతోవుండమని వారికి ధైర్యముచెప్పింది. వారి క్షేమము కోసరము తన శక్తికొలదీ పాటుపడతానన్నది. వారిని ఆదరించి సమదాయించినది. కమలయందు విమలకు పాము పగ. గాని విమలకు అపరిమితమైన దయ. జాలి; ఆమెను మంచిదారిలోనికి యెట్లు తీసికొనివత్తువాయని ఆలోచింపసాగింది. కూలీలు ఆశ్చర్యపడిపోతున్నారు.

౪

కూలీలంతా యిప్పుడు కమలసహాయంతో తమంతటతాము కంపెనీయేర్పాటు చేసుకొన్నారు. ప్రతికూలీకి దానిలో భాగముంది. తాము మొదటినెలరోజుల్లో సంపాదించే దానిలో సంగం వాటాక్రింద పోతుందని కావలసినడబ్బంతా కమలేయిచ్చినది. కూలీలు, యీకంపెనీకి అధ్యక్షురాలుగా ఎన్నుకొన్నారు. వచ్చేలాభాల్లో కమలచే స్థాపింపబడిన అనాధశరణాలయానికి నాలుగోవంతు యిచ్చివేస్తారు. మిగిలినది కంపెనీకి పెట్టుబడికి వినియోగిస్తారు.

విమలవ్యాపారం దీనివల్ల పడిపోయింది. మండిపడిపోతున్నది. యీసంగతంతా విన్నది. ఎల్లాగయినా కమలను యీలోకనుండి పంపి, ఆకంపెనీని నాశనంచేస్తేనేగాని తనకు శ్రేయస్సులేదనుకొంది. అందుచేత ఓరోజున కమలను చూడటకువచ్చినా [illegible]

549

ఆమెవద్దకు వచ్చినది. రహస్యముగా మాట్లాడవలెనని ఆమెకు కబురుపంపినది. విమల వచ్చిందనగానే, కమల ఆమెను దయతో ఆహ్వానముచేసింది. క్షేమసమాచారాన్ని అడిగింది. విమలమటుక్కు కమలను తుదముట్టింప, ఆలోచనచేస్తూవున్నది. అనుకూల పరిస్థితులకోసం యెదురుచూస్తూన్నది.

కమల పరాకుగానున్నపుడు, విమల తాను దుస్తులలోదాచిన బాకును పైకితీసింది. ఆ సమయమందే కమలకోసం యెవరో వచ్చారనిన్ని, కార్డు యిచ్చినారనిన్నీ చెప్పడానికి ఒకకూలీవచ్చాడు. అతడు యీదృశ్యాన్ని చూచాడు. భుజాన్నివున్న గొడ్డలిని విమలవైపు విసరివేసినాడు. దాంతో నిద్రనుండి మేల్కొన్నదానివలె వులిక్కిపడి లేచింది. ఇదంతా ఒక్కనిముసంలోజరిగింది. అందుచేత ఆమె నిర్ఘాంతపడిపోయింది.

కాని కమల విమలకుసంభవించిన స్థితికి చాలా విచారపడినది. కూలీని చివాట్లుపెట్టినది. వెంటనే డాక్టరుకు కబురుపంపినది. అతనొచ్చిచూచి దెబ్బబలమైనది. మాడుకు తగిలినది గనుక లాభములేదనిచెప్పి చక్కావెళ్ళిపోయాడు. విమల చావుబ్రతుకులమీద వున్నది. రక్తం కాల్వగా ప్రవహించుచున్నది. ఆమెకు నెనుకటి తనుచేసిన అకార్యములన్నీ జ్ఞాపకమునకు రాసాగినవి. అపరిమితమయిన బాధపడుచున్నది. కమల వుపచారాలు చేస్తున్నది. ఆమెకు కళ్ళవెంబడినీళ్లు ఏకధారగా ప్రవహించుచున్నవి. తనశక్తికొలది విమలను బ్రతికించడంకోసం ప్రయత్నాలు చేసింది. గాని లాభము లేకపోయినది. విమలప్రాణములు నిముషాలమీద నున్నవి. తనుచేసిన దుర్మార్గములకు పశ్చాత్తాపపడినది. కమలను చేతులుపట్టుకొని క్షమింపమని ప్రార్థించినది. పదివేలరూపాయలకు కమల శరణాలయమునకు చెక్కు వ్రాసియిచ్చినది. చేతులెత్తి పరమాత్మను, తనపాపములను క్షమింపమని వేడుకున్నది. "కమలా నీవు ఆదర్శప్రాయురాలవు" అని ఆఖరుమాటగా అన్నది. చీకటి నలువైపులా ఆవరించినది. విమలప్రాణాలు ఆమెనుండిలేచి పంచభూతములలోకలసిపోయినవి. భగవంతునిమాయ!

శ్లో॥ శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ॥